
సాక్షి
సంగారెడ్డి
మంగళవారం : 6 : మే : 2025



రెగ్యులర్ ఈవో కలేనా!

ఏడుపాయల ఆలయానికి రెగ్యులర్ ఈవో నియామకం కలగానే మిగిలిపోతుంది.

వివరాలు 8లో ▸



ప్రతి రైతు భూమికి..

భూమి ఉన్న ప్రతి రైతుకు ఆధార్ లింక్‌తో పాటు భూమికార్డును ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు.

వివరాలు 9లో ▸



పశువుల ఎరువు..

చేనుకు చేవ.. పంటకు బలమని రైతులు పశువుల పేడ ఎరువు కొనడానికి ఆసక్తి చూపుతుంటారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

వైద్య కళాశాల బస్సు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న మంత్రి దామోదర, చిత్రంలో కలెక్టర్, విద్యార్థులు

సంగారెడ్డి జోన్: సమాజంలో మార్పునకు బాలికలు విద్యావంతులుగా ఎదగాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. తోషిబా పరిశ్రమ సీఎస్ఆర్ నిధుల ద్వారా జోగిపేట ఆందోల్‌లోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు మంజూరైన బస్సును మంత్రి దామోదర, కలెక్టర్ వల్లూరు క్రాంతి, విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి బస్సులో ప్రయాణించారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, పరిశ్రమ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 55 అర్జీలు

సంగారెడ్డి జోన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వివిధ గ్రామాల ప్రజలు తరలివచ్చారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేటు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అర్జీలను స్వీకరించారు. సమస్యలు పరిష్కారం కాకపోవటంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులకు ప్రజలు వివరించారు. ఎన్నిసార్లు అధికారుల దగ్గరకు వెళ్లినా సమస్యలు పరిష్కారం కావటం లేదని తమ ఆవేదన వ్యక్తంచేశారు. కాగా, 55 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. డీఆర్‌ఓ పద్మజారాణి, అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణే కాంగ్రెస్ ధ్యేయం

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రాజ్యాంగ రక్షణే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వెంకటాపూర్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రలో ఆయన మాట్లాడారు. మహాత్మా గాంధీ, అంబేడ్కర్‌ను గౌరవించుకోవాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ను జాతీయ కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గొప్ప కార్యక్రమమన్నారు. ఈ నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు శ్రీనివాస్, కృష్ణ, హరి, ప్రేమానందం,రామ్ గౌడ్, కుమార్, పోచన్న, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

ఎస్పీ పరితోష్ పంకజ్



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ పరితోష్ పంకజ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో తగు సూచనలు సలహాలు అందించారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రాంతాల విషయంలో సీఐ నయాముద్దీన్‌తో మాట్లాడారు. ప్రమాదాలు జరగకుండా చర్య లు తీసుకోవాలని సూచించారు. జిన్నారం ట్రైనీ ఎస్ఐ చైతన్య కుమార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కేంద్రమంత్రి గడ్కరీకి ఐఎన్‌టీయూసీ వినతి

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వరంగ సంస్థలైన బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఆర్డినెన్స్ పరిశ్రమలకు వర్క్‌ఆర్డర్లను పెంచి కార్మికులకు జీవనోపాధి కల్పించాలని కోరుతూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీకి ఐఎన్ టీయూసీ జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి, ఎంపీ సురేష్ షెట్కార్‌తో కలిసి సోమవారం కేంద్రమంత్రికి వినతి పత్రం ఇచ్చారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆర్టికల్ 15 (5) ప్రకారం ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎస్సీ ఎస్టీ బీసీ ఆదివాసి విద్యార్థులకు రిజర్వేషన్లు కల్పించాలని జహీరాబాద్, సంగారెడ్డి పటాన్‌చెరు , నియోజకవర్గాలలో సుమారు నాలుగు లక్షల మంది కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం అంతంత మాత్రమే అని సొంత భవనాలను ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలన్నారు. అలాగే 28 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం ఆపాలని డిమాండ్ చేశారు.

మా శిక్షణ.. రైతులకు రక్షణ



విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న రైతులు

మాకిచ్చిన శిక్షణ రైతులకు రక్షణ కవచంలా ఉపయోగపడాలని ఫల పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త సుచిత్ర అన్నారు. జహీరాబాద్ మండలంలోని రంజోల్ రైతు వేదికలో సోమవారం శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'పని అనుభవ' కార్యక్రమంలో భాగంగా కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల విద్యార్థులు జహీరాబాద్ ప్రాంతానికి వచ్చి ఎంతో నేర్చుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు వివిధ స్టాళ్లను ఏర్పాటు చేసి ప్రదర్శించారు. ఒక్కో విద్యార్థికి ఐదు మట్టి నమూనాల చొప్పున కేటాయించగా 200 మట్టి పరీక్షలను పూర్తిచేసి భూసార పరీక్ష ఫలితాల కార్డులను పూర్తిచేసి ఇచ్చారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు లావణ్య, మాధవి, నితీష్, ప్రొఫెసర్ నిరోష, ఉద్యాన అధికారి మౌనిక, కేవీకే భూసార నిపుణులు స్వామి, ఏఈఓ ప్రదీప్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు. – జహీరాబాద్



మట్టి పరీక్షల కార్డులను అందుకున్న రైతులు

ఇందిరమ్మ ఇదేం కిరికిరి?

ప్రహసనంగా ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

- పెరిగిన రాజకీయ జోక్యంతో అర్హులకు చోటు ప్రశ్నార్థకం
- నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదానికి సిద్ధమవుతున్న ప్రతిపాదనలు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ ప్రహసనంగా తయారైంది. ఇందులో రాజకీయ జోక్యం పెరిగిపోవడంతో అర్హులైన నిరుపేదలను లబ్దిదారులుగా ఎంపిక చేయడం ప్రశ్నార్థకంగా మారింది. పేదలకు గూడు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున ఈ ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లా వ్యాప్తంగా ఐదు నియోజకవర్గాలకు 17,500 ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఇళ్ల కోసం ఇప్పటికే దరఖాస్తులను స్వీకరించిన విషయం విదితమే. ఇలా స్వీకరించిన దరఖాస్తుల వెరిఫికేషన్ చేసి అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. ఈ రాజకీయ జోక్యం పెరిగిపోవడంతో అర్హులైన నిరుపేదలను లబ్ధిదారులుగా ఎంపిక కావడం ప్రశ్నార్థకంగా తయారైంది. స్థానికంగా ఉండే నాయకులు, చోటా మోటా నాయకులు తమకు అనుకూలమైన వారి పేర్లను అర్హుల జాబితాలో చేర్చాలని పట్టు బడుతుండటంతో ఈ జాబితా రూపకల్పన అధికారులకు తలనొప్పిగా తయారైంది.



సంగారెడ్డిలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ ఇల్లు

ఇందిరమ్మ కమిటీల కిరికిరి

ఈ పథకానికి అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు కోసం ప్రభుత్వం గ్రామ స్థాయిలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసిన విషయం విదితమే. అయితే ఈ కమిటీల విషయంలో రాజకీయ దుమారం రేగుతోంది. ఆదివారం సంగారెడ్డిలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఈ ఇందిరమ్మ కమిటీల విషయంలో మంత్రి దామోదర ముందే పార్టీ జిల్లా ఇన్‌చార్జిగా నియమించిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌ను నిలదీయడం చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ నాయకులు తమ అనుచరులకే ఇందిరమ్మ గృహాలను మంజూరు చేయిస్తున్నారని, .. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా కూడా చాలా చోట్ల వారి పెత్తనం నడుస్తోందని వేదికపై ఉన్న నేతలను ప్రశ్నించారు. ఇందుకు ఇందిరమ్మ కమిటీలదే ఉదాహరణ అంటూ పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేయడం రాజకీయ వర్గాల్లోనే కాదు, ఇటు అధికార వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాలు

లబ్ధిదారుల ఎంపిక కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాలుగా రూపొందించారు. ఇంటి స్థలం ఉండి.. అన్ని అర్హతలు ఉన్న వారికి ఎల్-1లో చేర్చారు. ఇలా ఎల్-1 జాబితాలో ఉన్న వారికే లబ్ధిదారుల ఎంపికలో తొలి ప్రాధాన్యత ఇవ్వాలని గతంలో ప్రభుత్వం ఆదేశించింది. కానీ ప్రస్తుతం ఈ జాబితాలను పెద్దగా పరిగణలోకి తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ జాబితాతో ప్రమేయం లేకుండానే లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా ఈ లబ్ధిదారుల జాబితాల తయారీ కొలిక్కి వచ్చిందని, మంజూరు కోసం త్వరలోనే జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపుతామని సంబంధిత శాఖల అధికారులు పేర్కొంటున్నారు.

ఇన్‌చార్జి మంత్రి ఆమోదం కోసం..

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదాన్ని తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు సూచించిన వారే లబ్ధిదారులుగా ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధానంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు లేని చోట్ల ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు సూచించిన వారి పేర్లు జాబితాలో చేర్చే అవకాశాలు ఉన్నాయి.

పంటల ప్రణాళిక సిద్ధం

- 2.98 లక్షల హెక్టార్లలో పంటలు సాగవుతాయని అధికారుల అంచనా
- ఈ సారి పెరగనున్న సన్నాల సాగు
- 1,43,817.81 హెక్టార్లలో పత్తి పంట
- 59,424.7 హెక్టార్లలో వరి

నారాయణఖేడ్: వానాకాలం సీజన్‌లో జిల్లాలో 2,98,718.22 హెక్టార్లలో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు పంటల సాగుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను ఖరారు చేసింది. ఇందులో 1,43,817.81 హెక్టార్లలో పత్తిపంట సాగు జరిగేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. అదే విధంగా రెండో ప్రధాన పంటగా 59,424.7 హెక్టార్లలో వరి సాగు చేపట్టాలని నిర్ణయించింది. ఇక కంది 32,044.53 హెక్టార్లు, సోయాబీన్ 29,817.81హెక్టార్లు, పెసర 5,749.39 హెక్టార్లు, మినుము 3,465.59 హెక్టార్లు, చెరుకు 7,957.09 హెక్టార్లు, మొక్కజొన్న 3,441.3, జొన్న 237.25, హార్టికల్చర్‌లో 9,898.79 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగవుతాయని లెక్కకట్టింది. వీటితో పాటు కొర్రలు, రాగులు, సామలు, స్వీట్‌కార్న్, ఎర్ర జొన్నలు, ప్యారాగ్రాస్, ఉలువలు, వేరుశనగ, ఆవాలు, సాములు, గడ్డినువ్వులు, పొద్దుతిరుగుడు, హనుములు, బొబ్బర్లు తదితర పంటలను తక్కువ మోతాదులో సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయశాఖ యాక్షన్ ప్లాన్ తయారు చేసింది. జిల్లా మొత్తంలో ఈ వానాకాలంలో 2,98,718.22 హెక్టార్లలో అన్ని రకాల పంటలు సాగు జరిగే అవకాశం ఉందని లెక్కగట్టింది.

అవసరం మేరకు విత్తనాలు..

రైతుల సాగు అవసరం మేరకు విత్తనాలు సిద్ధంగా ఉంచేందుకు వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది. జిల్లాలో విత్తనాల కొరత లేకుండా ఉండేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. పచ్చిరొట్ట విత్తనాలైన జనుము 6,500 క్వింటాళ్లు, జీలుగ 4,500 క్వింటాళ్లు కలిపి 11వేల క్వింటాళ్ల మేర విత్తనాలు అవసరం అని ప్రతిపాదనలు పంపించారు. ఈ సారి వరిలో సన్నాల సాగు అధికంగా జరిగే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా సరిపడా విత్తనాలు సిద్ధంగా ఉంచేందుకు చర్యలు చేపట్టారు. నకిలీ విత్తనాల బెడద ఉండకుండా కూడా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



ఫసల్ బీమా అమలుకు కసరత్తు..

ఈ సీజన్ నుంచి ఫసల్ బీమా అమలుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. రైతు వాటా ఎంత మేర ఖరారు చేయాలని, లేదా ప్రీమియంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం చెరి సగం భరించే విధంగా విధి విధానాలు ఖరారు ఉండనున్నట్లు తెలుస్తోంది. దిగుబడి ఆధారిత బీమా పథకం కింద వరి, మొక్కజొన్న, కంది, మినుము, సోయాబీన్, వేరుశనగ, శనగ, నువ్వులు మొదలైన పంటలు. వాతావరణ ఆధారిత బీమా కింద పత్తి, మిరప, మామిడి, ఆయిల్‌పామ్, టమాట, బత్తాయి పంటలకు బీమా వర్తింపజేయనున్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా దిగుబడుల్లో నష్టం జరిగిన పక్షంలో దిగుబడి ఆధారిత బీమా ద్వారా రైతుకు పరిహారం అందనుంది. కాగా రైతులు వేసవి దుక్కులను సిద్ధం చేస్తున్నారు. ఆయా పంటల దిగుబడులు పూర్తి కావడంతో వేసవి దుక్కులు దున్నుకుంటున్నారు.

నెలలో భూ సమస్యలు పరిష్కారం

కలెక్టర్ క్రాంతి

కొండాపూర్(సంగారెడ్డి): భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకొచ్చిందని కలెక్టర్ క్రాంతి అన్నారు. సోమవారం కొండాపూర్ మండలం తొగర్ పల్లి, అలియాబాద్ గ్రామాల్లో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. భూభారతి పైలెట్ ప్రాజెక్టు కింద కొండాపూర్ మండలాన్ని ఎంపిక చేశామన్నారు. భూ సమస్యలు లేని మండలంగా కొండాపూర్‌ను తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ సదస్సులు అనంతరం నెలలోపు భూ సమస్యలన్నీ పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.

గత ప్రభుత్వాలు చేసిన తప్పిదాల వలన భూ సమస్యలు ఏర్పడ్డాయని టీజీ ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా రెడ్డి విమర్శించారు. దీంతో రైతులు కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరిగే వారన్నారు. ఈ సదస్సులో ఆర్డీఓ రవీందర్ రెడ్డి, తహసీల్దార్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి, చిత్రంలో నిర్మలారెడ్డి

ఆధునికతను అందిపుచ్చుకోండి

- సేంద్రియం, పంట మార్పిడితోనే అధిక దిగుబడులు
- మోతాదుకు మించి రసాయన మందులు వాడొద్దు
- ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న శాస్త్రవేత్త విజయ్‌కుమార్

న్యాల్‌కల్(జహీరాబాద్): ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని ఉపయోగించి పంటలు పండిస్తే ఆశించిన మేర దిగుబడులు పొందవచ్చునని బసంత్‌పూర్ ప్రొఫెసర్, జయశంకర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. 'రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు'కార్యక్రమంలో సోమవారం మండల పరిధిలోని మామిడ్గి గ్రామంలో పంటల సాగు విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ అధిక శాతం రైతులు ఇంకా పాత విధానంలోనే పంటలు పండిస్తూ సరైన దిగుబడులు రాక నష్టపోతున్నారని చెప్పారు. అధిక దిగుబడులు సాధించాలనే తపనతో రసాయన మందులు, పురుగు మందులు మోతాదుకు మించి వాడుతున్నారని, ఫలితంగా లాభాలకంటే నష్టమే ఎక్కువ జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సాధ్యమైనంత వరకు సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని సూచించారు. పంట మార్పిడి తప్పకుండా చేయాలన్నారు. నీటిని వృథా చేయకుండా అవరానికి అనుగుణంగా వాడుకోవాలన్నారు. నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులను కొనుగోలు చేసుకొని వాటికి సంబంధించిన రశీదును తప్పకుండా తీసుకోవాలని సూచించారు. అలా చేయడం వల్ల నకిలీ విత్తనాలు అని తేలితే పరిహారం పొందవచ్చునన్నారు. పంటల సాగు విధానాలపై క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రైతులు అందు బాటులో ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంగారెడ్డి వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల శాస్త్రవేత్త చరిత్ కుమార్‌తో పాటు అనీల్‌కుమార్, అవినాష్‌వర్మ, రమేష్ పాటిల్, రైతులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

ఆర్డీఓ కార్యాలయం ఎదుట భూ బాధితుల నిరసన

జహీరాబాద్ టౌన్: మండలంలోని బూచినెల్లి భూ బాధితులు సోమవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రాంచందర్ మాట్లాడుతూ బూచినెల్లి గ్రామ పరిధిలో జాతీయ రహదారి పక్కనే కోట్ల విలువైన పేదల భూములను ప్రభుత్వం పరిశ్రమల కోసం తీసుకుందన్నారు. పరిహారం కింద ఎకరాకు రూ.15 లక్షలు, 120 గజాల ఇంటి స్థలం, రైతుల కుటుంబాలకు శాశ్వత ఉద్యోగం, కాలుష్యంలేని పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని అప్పట్లో ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. కానీ ఎకరాకు రూ. 3,50 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకొని హామీలు అమలు చేయకుండా రైతులకు అన్యాయం చేస్తుందని ఆరోపించారు. ఎకరాకు రూ.15 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయం అధికారి వంశీ కృష్ణకు వినతి పత్రం అందజేశారు. నిరసన కార్యక్రమంలో బూచినెల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయం అధికారి వంశీ కృష్ణకు వినతి పత్రం ఇస్తున్న రాంచందర్, రైతులు

భూసర్వేనా.. సర్వర్లే..!

సర్వేయర్ల కొరత.. తీరని భూముల కొలత

- పరిష్కారానికి నోచుకోని భూ వివాదాలు
- హద్దు రాళ్లు లేకపోవడమే ప్రధాన సమస్య
- పెండింగ్‌లో 4 వేలకు పైగా దరఖాస్తులు

జిల్లాలో మొత్తం సర్వే నంబర్లు	1,67,948
మొత్తం భూమి 8లక్షల ఎకరాలకు పైనే..	
మండల సర్వే కొరకు 4070..	
జిల్లా సర్వే కొరకు పెండింగ్ దరఖాస్తులు 400	



సంగారెడ్డి జోన్: జిల్లాలో సర్వేయర్ల కొరత కారణంగా భూ సర్వేల సమస్యలు పరిష్కారం కావడం లేదు. దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా.. పెండింగ్‌లోనే ఉంటున్నాయి. గత ప్రభుత్వంలో జరిగిన భూ ప్రక్షాళన ఫలితంగా జారీ చేసిన కొత్త పట్టా పాసు పుస్తకాలలో భూమి వాస్తవానికి భిన్నంగా ఉండటంతో బాధితులు సర్వే కొరకు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ఎనిమిది మంది సర్వేయర్లు ఉండాల్సి ఉండగా.. ఒకరు మాత్రమే ఉన్నారు. మండలానికి ఒకరు చొప్పున 28 మంది సర్వేయర్లకు గాను 15 మంది మాత్రమే ఉన్నారు. అదేవిధంగా డిప్యూటీ సర్వేయర్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు సైతం ఖాళీగానే ఉన్నాయి. ప్రస్తుతం ఉన్నవారికి అదనపు బాధ్యతలను అప్పగించారు. దీంతో సర్వే పనులు మాత్రం ముందుకు సాగటం లేదు.

• పెండింగ్‌లో దరఖాస్తులు

జిల్లాలో 28 మండలాలకు గాను 760 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాలలో 1,67,948 సర్వే నంబర్లు, సుమారు 8 లక్షలకు పైగా ఎకరాల భూమి ఉంది. 96,195 టీ పన్‌లు అందుబాటులో ఉన్నాయి. ఆయా సర్వే నంబర్లలో గత కొన్ని సంవత్సరాలు క్రితం సర్వే చేయగా ప్రస్తుతం హద్దులు చెరిగిపోయి, భూములు వివాదాస్పదంగా మారాయి. జిల్లాలో మొత్తం 4,470 దరఖాస్తులలో మండల సర్వేకు 4070, జిల్లా స్థాయి సర్వేకు 400 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

• సర్వేయర్ల కొరకు నిరీక్షణ

తమ భూములు సర్వే చేసేందుకు అధికారుల కొరకు ఎదురుచూపులు తప్పడం లేదు. మండల స్థాయిలో సర్వే చేసుకునేందుకు రూ.295, జిల్లాస్థాయిలో రూ. 1400 చెల్లించాల్సి ఉంటుంది. డబ్బులు చెల్లించి నెలలు తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. సర్వే చేసేముందు సరిహద్దు యజమానులకు నోటీసులు అందించాల్సి ఉంటుంది. గతంలో వీఆర్‌ఓ నోటీసులు అందించేవారు. ప్రస్తుతం వారు లేకపోవడంతో అందించడంలో జాప్యం జరుగుతోంది.

• ప్రభుత్వ పనుల్లో అధికారులు బిజీ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి పనుల్లో సర్వేయర్లు బిజీగా ఉన్నారు. భూ సేకరణ, భూ కేటాయింపు, సర్వేలు తదితర పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లాలో ప్రస్తుతం నిమ్జ్, ఎన్.హెచ్ 65, టీజీఐఐసీ, హెచ్ఎండీఏ, ట్రిపుల్ ఆర్ తదితర పనుల్లో ఉన్నారు.

పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలు

సర్వేయర్ల కొరత కారణంగా భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. పట్టా పాసుపుస్తకాలలో వాస్తవంగా ఉన్న భూమి కంటే ఎక్కువ, తక్కువగా నమోదు అయి ఉండటం, తహసీల్దార్ కార్యాలయాలలో ఉన్న రికార్డులకు పాసు పుస్తకాలకు సరిపోను లేకపోవడం, కబ్జాలో ఉన్నది కాకుండా ఇతర నంబర్లు నమోదు కావడం వంటి భూ సమస్యలతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

సమస్యలు పరిష్కరిస్తున్నాం



జిల్లాలో నెలకొన్న భూ సర్వేలు వీలైనంతవరకు పరిష్కరిస్తున్నాం. పలుచోట్ల సర్వేర్లు లేకపోవడం, ప్రభుత్వం పనుల్లో నిమగ్నమై ఉండటంతో ఆలస్యం జరుగుతోంది. అయినా సర్వేలు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఐనేష్, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్, ఏడీ సంగారెడ్డి

క్లుప్తంగా

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మద్దూరు యువకుడు


కార్తీక్ గౌతమ్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): సౌత్‌జోన్ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌కు మండల కేంద్రానికి చెందిన బేజాడి కార్తీక్ గౌతమ్‌రెడ్డి ఎంపికైనట్లు మెదక్ జిల్లా హ్యాండ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ సెలక్షన్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. 9 నుంచి 12 వరకు తమిళనాడు రాష్ట్రంలో జరిగే టోర్నమెంట్ రాష్ట్ర జట్టు తరఫున పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గౌతమ్ రెడ్డిని సిద్దిపేట జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కందుకూరి ఉపేందర్ గుప్తా, దామెర మల్లేశం, జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

టేక్మాల్(మెదక్): తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండలంలోని సంగ్యాతండా పంచాయతీ పరిధిలోని కడిలాబాయి తండాలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. తండాకు చెందిన కున్‌సోత్ మోహన్ కుటుంబ సభ్యులు ఉదయం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులతోపాటు ఉపాధి హామీ పనులకు వెళ్లారు. పనులు ముగించుకొని ఇంటికొచ్చే సరికి గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లో చొరబడ్డారు. బీరువాలోని తులం బంగారం, 35 తులాల వెండి, రూ.15 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు, బైకు ఢీ : ఒకరు మృతి

పెద్దశంకరంపేట(మెదక్): కారు, బైకు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన పెద్దశంకరంపేట శివారులో చోటు చేసుకుంది. అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, ట్రైనీ ఎస్‌ఐ అరవింద్ కథనం మేరకు.. భీమన్నపల్లి మురళీ క్రిష్ణ(32), అంజన్నగారి హరీశ్ పెద్దశంకరంపేట వైపు నుంచి మల్కాపూర్ వైపు బైక్‌పై వెళ్తున్నారు. మార్గమధ్యలో రేగోడ్ వైపు నుంచి పేట వైపు వస్తున్న కారు ఢీకొట్టడంతో మురళీ క్రిష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. హరీశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరు మహిళలు అదృశ్యం

ఇంటి నుంచి వెళ్లి..

శివ్వంపేట(నర్సాపూర్) : ఇంటి నుంచి వెళ్లి మహిళ అదృశ్యమైంది. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి కథనం మేరకు.. మండల పరిధి పోతులబోగూడ గ్రామానికి చెందిన బత్తులు లక్ష్మీ (58) గత నెల 24న పాంబండలో జరిగిన బంధువుల పెళ్లికి వెళ్లింది. రెండు రోజుల ద్వారా ఇంటికొస్తానని చెప్పడంతో కుటుంబ సభ్యులు గ్రామానికి వెళ్లిపోయారు. 26న కుటుంబ సభ్యులు పాంబండలో ఉన్న బంధువులకు లక్ష్మీ గురించి ఫోన్ చేయగా ఉదయమే పోతుల బోగూడకి బయలుదేరిందని చెప్పారు. ఇంటికి రాకపోవడంతో పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. లక్ష్మీ కుమారుడు నాగులు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో..

గజ్వేల్‌రూరల్: కుటుంబ కలహాలతో వివాహిత అదృశ్యమైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గజ్వేల్‌కు చెందిన జర్రు శారద భర్త చనిపోవడంతో ఏడాది కిందట ప్రమోద్ అనే వ్యక్తిని రెండో పెళ్లి చేసుకుంది. దంపతుల మధ్య గొడవలు జరుగుతుండటంతో మనస్తాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయి తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. శారద కోసం తల్లిదండ్రులు తెలిసిన చోట వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రెగ్యులర్ ఈవో కలేనా!

ఇన్‌చార్జీలతోనే ఏడుపాయల ఆలయం

- ఇటీవల రంగారెడ్డి జిల్లాకు ఇన్‌చార్జి ఈవో చంద్రశేఖర్ బదిలీ
- అయినా తప్పని ఉమ్మడి మెదక్ జిల్లా అదనపు బాధ్యతలు
- తలకు మించిన భారంతో సతమతం
- రెగ్యులర్ ఈవో లేక భక్తులకు వసతులు కరువు


ఏడుపాయల పుణ్యక్షేత్రం


చంద్రశేఖర్ అసిస్టెంట్ కమిషనర్

పాపన్నపేట(మెదక్): తెలంగాణలోనే ప్రసిద్ధి చెందిన ఏడుపాయల ఆలయానికి రెగ్యులర్ ఈవో నియామకం కలగానే మిగిలిపోతుంది. మెదక్ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్, ఏడుపాయల ఇన్‌చార్జి ఈవో చంద్రశేఖర్‌ను నాలుగు రోజుల కిందట రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో రెండు జిల్లాల అదనపు కమిషనర్‌గా.. ఏడుపాయల ఇన్‌చార్జి ఈవోగా బహుముఖ బాధ్యతలు నిర్వహించలేక.. తలకు మించిన భారంతో సతమత మవుతున్నారు. తెలంగాణలోనే ప్రసిద్ధి చెందిన ఏడుపాయలకు రెగ్యులర్ ఈవో లేక భక్తులు అవస్థల పాలవుతున్నారు.

రెండు జిల్లాల ఆలయాల బాధ్యతలు

మెదక్ ఉమ్మడి దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న చంద్రశేఖర్ రెండేళ్ల కిందట ఏడుపాయల ఇన్‌చార్జి ఈవోగా బదిలీ అయ్యారు. అప్పటి నుంచి రెండు బాధ్యతలు చూస్తూ వస్తున్నారు. నాలుగు రోజుల కిందట రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. ఇక్కడి నుంచి బదిలీ అయినా పాత పోస్టులు కూడా అలానే ఉంచడంతో పని భారం ఎక్కువైంది. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట మూడు జిల్లాల్లో కలిసి గుర్తింపు పొందిన 36 పెద్ద దేవాలయాలతోపాటు, చిన్నాచితక సుమారు 3 వేల ఆలయాలు ఉన్నాయి. అలాగే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సుమారు 6 వేల దేవాలయాల వరకు ఉంటాయని తెలుస్తుంది. వీటన్నింటికీ అసిస్టెంట్ కమిషనర్‌గా చంద్రశేఖర్ బాధ్యతలు నిర్వర్తించాలంటే తలకు మించిన భారమే అవుతుంది.

రూ.లక్షల్లో ఆదాయం ఉన్నా..

తెలంగాణలో ప్రసిద్ధి చెందిన దేవాలయం ఏడుపాయల. 6ఏ టెంపుల్‌గా గుర్తింపు పొందిన వనదుర్గమ్మ ఆలయం దర్శించుకోవడానికి యేటా సుమారు 20 లక్షల మంది భక్తులు వస్తారు. సుమారు రూ.15 కోట్ల ఆదాయం ఉంటుంది. ఆది, మంగళ, శుక్ర వారాల్లో వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. మహాశివరాత్రి జాతరకు సుమారు 12 లక్షల భక్తులు వస్తారు. ఇంతటి ప్రాధాన్యత గల దేవాలయానికి రెగ్యులర్ ఈవో లేకపోవడం దురదృష్టకరమని భక్తులు వాపోతున్నారు. తమ సమస్యలు పరిష్కరించే నాథుడే లేడని అంటున్నారు.

ఏళ్ల కొద్దీ ఇన్‌చార్జీలతో పాలన

2023లో ఈవో సార శ్రీనివాస్ బదిలీ అయిన తర్వాత మోహన్ రెడ్డి వచ్చారు. ఆయన రిటైర్‌మెంట్ తర్వాత అసిస్టెంట్ కమిషనర్ వినోద్ రెడ్డి, క్రిష్ణ ప్రసాద్ వచ్చారు. అప్పట్లో నెల లోపు ముగ్గురు ఈవోలు మారారు. అనంతరం వచ్చిన అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ ఇన్‌చార్జి ఈవోగా కొనసాగుతూ ఇటీవల రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. అయినా ఆయనకే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పారు. బహుముఖ విధులు నిర్వరిస్తున్న ఆయన ఏడుపాయలకు పూర్తిగా న్యాయం చేయలేక పోతున్నారని భక్తులు వాపోతున్నారు. గతంలో ఎంతో మంది గ్రేడ్-2 ఈవోలు ఏడుపాయల ఈవోలుగా పని చేశారు. ఈ క్రమంలో గ్రేడ్-2 స్థాయి ఈవోనైనా నియమించి తమ ఇబ్బందులు తీర్చి ఏడుపాయల అభివృద్ధికి తోడ్పడాలని కోరుతున్నారు.

అమ్మానాన్నల కల సాకారం

తొలి ప్రయత్నంలోనే జూనియర్ సివిల్ జడ్జిగా సాహితీ


కోర్టు వద్ద సాహితీ

నంగనూరు(సిద్దిపేట) : సిద్దిపేట జిల్లా నంగనూరు మండల కేంద్రానికి చెందిన మల్యాల సాహితీ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైంది. అమ్మానాన్నల ప్రోత్సాహంతో తొలి ప్రయత్నంలోనే.. 26 ఏళ్ల వయస్సులోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఉద్యోగం సాధించింది.

సాహితీ సిద్దిపేట పట్టణంలో ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి, హైదరాబాద్‌లో ఇంటర్ చదివింది. బెంగుళూరులోని రెవా యూనివర్సిటీలో 2017-22 వరకు బీబీఏ ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసింది. 2022-24 వరకు హైదరాబాద్‌లోని పడాల రామిరెడ్డి లా కళాశాలలో ఎల్‌ఎల్‌ఎమ్ పూర్తి చేయగా అంతలోనే జూనియర్ సివిల్ జడ్జి నియామకాలకు నోటిఫికేషన్ వచ్చింది. జూన్ 2024లో ప్రిలిమ్స్, నవంబర్‌లో జరిగిన మెయిన్స్‌లో అర్హత సాధించింది. ఏప్రిల్ 2025లో ఇంటర్వ్యూలు అయ్యాయి. అదే నెల 30న జూనియర్ సివిల్ జడ్జి నియామకాలకు సంబంధించి ఫలితాలు విడుదల కాగా మల్యాల సాహితీ ఎంపికైంది. జడ్జిగా ఎంపిక కావాలని పట్టుదలతో సాహితీ 10 నెలల పాటు కష్టపడింది. ప్రతి రోజూ 8 నుంచి రాత్రి 10 గంటల పాటు ఇంటి దగ్గరనే సన్నద్ధమైంది. పుస్తకాల నుంచి తానే సొంతంగా స్టడీ మెటీరియల్‌ను సిద్ధం చేసుకుంది.

మా కలను కూతురు నెరవేర్చింది



మేము ఇంటర్ చదువుతున్న సమయంలోనే మాకు వివాహమైంది. చదువు మధ్యలోనే ఆపేశాం. మా పిల్లలకు ఎప్పుడు చెప్పుబుతుంటాం.. మేము చదువుకోలేకపోయాం.. మీరు ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని. నేడు మా కలను సాహితీ నెరవేర్చింది. మా వంశంలోనే న్యాయవ్యవస్థలో జడ్జి ఉద్యోగం సాధించిన మొదటి వ్యక్తి మా సాహితీ.

– మల్యాల రాజు, అన్నపూర్ణ తల్లిదండ్రులు

వివాహితను కాపాడిన షీ టీమ్ బృందం

అత్తింటి వేధింపులతో ఆత్మహత్యాయత్నం


జ్యోతితో మాట్లాడుతున్న షీ టీమ్ బృందం సభ్యుడు దేవదాస్

నర్సాపూర్ రూరల్: చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడుతున్న వివాహితను షీ టీమ్ బృందం సభ్యులు కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. కొల్చారం మండలం అప్పాజీపల్లి గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల జ్యోతి కుటుంబ సభ్యుల వేధింపులు తాళలేక సోమవారం నర్సాపూర్ రాయ రావు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు బయలుదేరింది. చెరువు ప్రాంతంలో స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న షీ టీమ్ బృందం సభ్యులు దేవదాస్, స్వామి సకాలంలో స్పందించారు. వెంటనే వెళ్లి జ్యోతిని కాపాడి నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. జ్యోతి భర్త లింగం, అత్త, మరిదితో పాటు ఇతర కుటుంబ సభ్యులు కొన్నేళ్లుగా వేధింపులకు గురి చేస్తున్నారని పలుమార్లు పంచాయితీ పెట్టినా మారకపోవడంతో విసుగు చెంది ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకున్నట్లు తెలిపింది. ఏడేళ్ల కిందట పిచ్చకుంట్ల గ్రామానికి చెందిన లింగంతో వివాహం జరిగిందని, ప్రస్తుతం ఇద్దరు కుమారులు కూడా ఉన్నట్లు చెప్పింది. తల్లిదండ్రులు నర్సాపూర్ లో నివాసం ఉంటారని పేర్కొంది.

పాన్ కోసం రోడ్డు దాటుతుండగా..

కారు ఢీకొని వ్యక్తి మృతి

మునిపల్లి(అందోల్): గుర్తు తెలియని కారు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుదేరాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజేశ్ నాయక్ కథనం మేరకు.. గుల్బర్గాకు చెందిన విఠల్‌రావు (75) ట్రాన్స్‌పోర్ట్ లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. పాన్ కోసం బుదేరా చౌరస్తా సమీపంలో రోడ్డు దాటుతున్నాడు. జహీరాబాద్ నుంచి హైద్రాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ట్రాన్స్ ఫోర్ట్ డ్రైవర్ అక్బర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి

చేర్యాల(సిద్దిపేట): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఆకునూరులో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన శిగుల్ల కనకయ్య(52) కొంత కాలంగా ఆరోగ్యం బాగా లేక ఆస్పత్రిలో చేరి చికిత్స పొందాడు. ఇటీవల మద్యం తాగుతుండటంతో భార్య మందలించింది. దీంతో మనస్తాపం చెంది శనివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు.

నాణ్యమైన మందులు అందించాలి


ఎన్నికైన దేవదాసు, సంతోష్, రాజుగౌడ్

గజ్వేల్‌రూరల్: మెడికల్ దుకాణాలకు వచ్చే ప్రజలకు నాణ్యమైన మందులు అందించి వారి మన్ననలు పొందాలని తెలంగాణ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, మెదక్ జిల్లా అధ్యక్షుడు తొడుపునూరి రాజు పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం గజ్వేల్ ఏరియా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవదాసు, ఉపాధ్యక్షుడిగా సంతోష్, జనరల్ సెక్రటరీగా యాదగిరి, రాజుగౌడ్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అదే విధంగా సీడీఏ జిల్లా జనరల్ సెక్రటరీగా వేముల వెంకటేశ్వర్‌రావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన మందులను అందించడంతోపాటు వారి మన్ననలను పొందాలని సూచించారు. రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సంగారెడ్డి, సిద్దిపేట జిల్లా డీసీఏ సభ్యులు పాల్గొన్నారు.

దళిత యువకుడిపై దాడి అమానుషం

సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీలు


ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వేచరేణి శివారు ఎల్లదాసునగర్‌కు చెందిన బేడ బుడిగ జంగం దళిత యువకుడిపై బీజేపీ మతోన్మాద ఆర్‌ఎస్‌ఎస్, హిందుత్వ బజరంగ్ దళ్ కార్యకర్తలు దాడి చేయడం అమానుషమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. సోమవారం ఎల్లదాసునగర్‌కు వెళ్లి బాధితుడితో మాట్లాడి కొత్త దుస్తులు అందించారు. అనంతరం అక్కడి నుంచి పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. దాడికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాడు. సీపీఎం నాయకులు శశిధర్, సత్తిరెడ్డి, వెంకట్‌మావో, బాల్ నర్సయ్య, యాదగిరి, రవికుమార్, ప్రశాంత్, శారద, రాజు, నాగరాజు, శ్రీహరి, ప్రభాకర్, మల్లేశం, అశోక్, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

దళిత యువకుడిపై దాడిని నిరసిస్తూ సీపీఐ నాయకులు పట్టణ కేంద్రంలో రాస్తారోకో చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ మాట్లాడుతూ.. దళిత యువకుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు భూమయ్య, యాదగిరి, భాస్కర్‌రెడ్డి, నర్సింహా చారి, నర్సయ్య, ఎల్లయ్య, బాపురాజు, సత్తయ్య, రాజు, సీతారామయ్య, యాదయ్య, నర్సింహులు, యాదవ్వ, ఇస్తారి, లచ్చయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దూకి యువతి ఆత్మహత్య


ప్రియాంక (ఫైల్)

పాపన్నపేట(మెదక్): చెరువులో దూకి యువతి ఆత్మహత్యకు పాల్పడింది.ఈ ఘటన మండల పరిధిలోని మల్లంపేటలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మల్లంపేట గ్రామానికి చెందిన చాకలి మల్లయ్య, శామల దంపతులకు ముగ్గురు ఆడ పిల్లలు. మల్లయ్య కరోనా సమయంలో చనిపోయాడు. తల్లి ఇద్దరు ఆడపిల్లల వివాహాలు చేసింది. బతుకు భారం కావడంతో శ్యామల చిన్న కూతురు ప్రియాంక(20)తో కలిసి హైదరాబాద్‌కి వలస పోయి జీవిస్తుంది. ఇటీవల రెండు నెలల కిందట తల్లీబిడ్డలు స్వగ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో సోమవారం ప్రియాంక ఫోన్‌లో మాట్లాడుతూ రెడ్ల చెరువు వద్దకు వెళ్లి నీటిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ప్రేమ వ్యవహారమే ఆత్మహత్యకు కారణమై ఉంటుందని భావిస్తున్నారు.

స్నేహితుల మధ్య గొడవ

ఉరేసుకున్న యువకుడు

న్యాల్‌కల్(జహీరాబాద్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని మెటల్‌కుంట గ్రామంలో చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్‌ఐ చల్లా రాజశేఖర్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన రాజు(32) జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అటెండర్‌గా పని చేస్తున్నాడు. గ్రామానికి చెందిన సుందర్, దిలీప్‌తో కలిసి మెలసి ఉండేవాడు. రెండు రోజుల కిందట రాజు ఫోన్ పోయింది. తోటి మిత్రులను మీరే తీశారని అడుగగా మాకు తెలీదని చెప్పారు. వినకుండా రాజు వారి బైక్‌ను తీసుకెళ్లాడు. బైక్ విషయంలో స్నేహితులు, రాజుకు మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన ఆదివారం రాజు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య పాల్పడ్డాడు. భార్య మధురవాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

సాగు అంశాలపై అవగాహన కల్పించడానికే..

- ‘రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు’ కార్యక్రమం
- వ్యవసాయ కమిషన్ సభ్యుడు రాములు నాయక్


మాట్లాడుతున్న రాములు నాయక్

రామాయంపేట(మెదక్): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో రైతులకు అందించడానికి వీలుగా ప్రభుత్వం ‘రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు’ అనే కార్యక్రమాన్ని చేపట్టిందని వ్యవసాయ కమిషన్ సభ్యుడు రాములు నాయక్ పేర్కొన్నారు. మండలంలోని రాయిలాపూర్ రైతువేదికలో సోమవారం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. చిన్నకారు, సన్నకారు రైతుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని, క్షేత్ర స్థాయిలో రైతుల సమస్యలు గుర్తించి, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి కమిషన్ కృషి చేస్తుందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో జరుగుతున్న పరిశోధన ఫలితాలను రైతులకు వివరించి వారికి చైతన్యపర్చడానికి అవగాహన శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి విన్సెంట్ వినయ్ మాట్లాడుతూ.. రైతులకు సాంకేతిక సలహాలను అందిస్తే పెట్టుబడులు తగ్గడంతోపాటు అధిక ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. 13వ తేదీ వరకు కొనసాగే అవగాహన శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శోభారాణి, రామాయంపేట వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ, డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత


పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

తూప్రాన్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శివానందం సోమవారం తెలిపారు. మండలంలోని గుండ్రెడ్డిపల్లి గ్రామ శివారులో హల్దీ వాగు నుంచి అక్రమంగా ఇసుకును ఫీల్టర్ చేసి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారన్న సమాచారం అందింది. ఈ మేరకు దాడి చేసి మూడు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు పోలీసుల రాకను చూసి పారిపోయినట్లు తెలిపారు. ట్రాక్టర్ యాజమానులు నాగరాజు, సురేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అసైన్డ్ భూములు కబ్జా

- మీర్జాపూర్, తోటపల్లి శివారు సరిహద్దులో రైతుల ఆక్రమణలు
- కుంట కట్టలు ధ్వంసం, నీటి కాల్వలు పూడ్చివేతలు
- పూడికతీత పనులు చేపడితేనే మేలు


వైదేరు కుంట కట్టను ధ్వంసం చేసి చదును చేస్తున్న యంత్రాలు

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వం పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను సమీప రైతులు ఆక్రమణలకు పాల్పడుతూ ప్రశ్నిస్తే బెదిరింపులకు గురి చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదల భూములకు సాగు నీరు సౌకర్యం లేకపోవడంతో పంటలు వేయక బీడు వారడంతో ఇదే ఇదునుగా భావించిన రైతులు హద్దు రాళ్లు జరిపి ఆక్రమిస్తున్నారు.

కరువుతో సాగుకు దూరం

తోటపల్లి రెవెన్యూ పరిధిలో వైదేరు కుంట దగ్గర పేదలకు 2.20 ఎకరాల అసైన్డ్ భూములను ప్రభుత్వం పేదలకు ఇచ్చింది. ఒకప్పుడు కుంట తూము పారకంతో పంటలు పండించిన రైతులు కరువుతో కుంటలు ఎండిపోవడంతో సాగు చేయలేకపోతున్నారు. పేదలకు ఇచ్చిన భూమిలో చెట్లను అమ్ముకోవడం, గెట్టు జరిపి భూమి కలుపుకోవడం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు భూ సర్వే చేసి పేదల భూములకు హద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కుంట కట్టలు ధ్వంసం..

హుస్నాబాద్ మండలంలో చిన్న నీటి వనరులను అభివృద్ధి చేయడానికి గొలుసు కట్టు కుంటలు, చెరువులను నిర్మించారు. ఇవి పూడికతో నిండిపోవడంతో గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంలో భాగంగా పూడిక పనులు చేయించి చెరువు, కుంటలకు పూర్వ వైభవం తీసుకొచ్చింది. చిన్న నీటి కుంటలను సమీప రైతులు కట్టలను ధ్వంసం చేసి బఫర్ జోన్ గొలుసు భూమిని ఆక్రమిస్తున్నారు. శుక్రవారం మీర్జాపూర్, తోటపల్లి శివారు సరిహద్దు లోని వైదేరు కుంట కట్టను ఓ రైతు ధ్వంసం చేసి చదును చేయడంతో పొరుగు రైతులు అడ్డుకొని ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి వచ్చిన అధికారులు జేసీబీ, డోజర్ తాళాలు తీసుకొని వెళ్లిపోయారు. తోటపల్లిలో మాసాని కుంట, ఎర్ర కుంట, వట్టే కుంట, మీర్జాపూర్‌లోని మంచీళ్ల కుంట శిఖం భూములను రైతులు ఆక్రమించి చదును చేస్తున్నారు. 20 చెరువులు, కుంటలకు ఒక ఏఈని ఇరిగేషన్ అధికారులు నియమించినా అభివృద్ధి పనులకు నిధులు లేకపోవడంతో పర్యవేక్షణ లేకుండా పోతుందని ఆరోపిస్తున్నారు.

హద్దులు ఏర్పాటు చేయాలి



మా ఎస్సీలకు వైదేరు కుంట కింద 2.20 ఎకరాలను ప్రభుత్వం అసైన్డ్ పట్టాలు ఇచ్చింది. కొద్ది రోజులు కుంట నీరుతో పంటలు సాగు చేసిన కరువుతో తూములు కూలిపోవడంతో నీటి కాల్వలు, అలుగును ధ్వంసం చేయడంతో మాకు నీళ్లు లేకుండా పోయాయి. కుంట కట్టను ధ్వంసం చేసి మా భూమిని ఆక్రమించే రైతులపై చర్యలు తీసుకోవాలి.

– మేదిని వెంకటస్వామి, గాంధీనగర్

కుంట కట్ట గొలుసు వరకు బఫర్ జోనే..



చెరువు, కుంట కట్టల కింద గొలుసు వరకు బంఫర్ జోన్ భూములే ఉంటాయి. వీటిని ఎవరు చదును చేయరాదు, ఆక్రమించరాదు. వైదేరు కుంట కట్ట ధ్వంసం చేసిన విషయం విచారణ జరిపి వాహనాలను స్వాధీనం చేసుకొని రైతు పై కేసు నమోదు చేయిస్తాం. శిఖం, నీటి కాల్వలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీధర్, ఏఈ ఇరిగేషన్

46 రోజుల తర్వాత తల్లిదండ్రుల చెంతకు విద్యార్థి

చదువుపై ఇష్టం లేక వెళ్లిపోయానని చెప్పిన బాలుడు

వట్‌పల్లి (అందోల్): హాస్టల్ నుంచి 46 రోజుల కిందట అదృశ్యమైన విద్యార్థిని సోమవారం వట్‌పల్లి పోలీసులు పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం మేరకు.. రేగోడ్ మండలం పెద్ద తండాకు చెందిన మెగావత్ లక్ష్మీ, రవి దంపతుల కుమారుడు మండల పరిధిలోని దేవనూర్ బాలుర హాస్టల్‌లో ఉంటూ అక్కడే ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఉగాది పండుగ సందర్భంగా మార్చి 20న హాస్టల్ నుంచి ఇంటికి రాలేదు. విద్యార్థి తల్లిదండ్రులు హాస్టల్ వద్దకు వెళ్లి కుమారుడు ఎక్కడికి వెళ్లాడని హాస్టల్ వార్డెన్‌ను నిలదీయగా ఆచూకీ లభించలేదు. ఏప్రిల్ 4న వట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. విచారణలో భాగంగా విద్యార్థి హైదరాబాద్‌లో ఉంటున్నాడని దర్యాప్తులో తేలింది. సోమవారం విద్యార్థిని వట్ పల్లికి తీసుకొచ్చి విచారించగా చదువుకోవడం ఇష్టం లేకనే హాస్టల్ నుంచి వెళ్లిపోయినట్లు తెలిపాడు. ఆ తర్వాత తల్లిదండ్రుల సమక్షంలో అతడికి కౌన్సిలింగ్ చేసి వారికి అప్పగించారు.